ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 21.4

ANDHRAJYOTHY

యాదాద్రి భువనగిరి

5

శుక్రవారం 15 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.803)	1,72,774	2,37,056
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.50 (3.84)	6,612	10,098
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.011 (38.360)	2,71,900	1,81,334

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



పోచంపల్లి మండలం జూలూరు-బీబీనగర్ మండలం రుద్రవెల్లి మధ్య బ్రిడ్జిపై గురువారం తగ్గుముఖం పట్టిన మూసీ వరద ఉధృతి

అక్కడక్కడ వర్షం

స్వల్పంగా తగ్గిన మూసీ ఉధృతి

యాదాద్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం అక్కడక్కడ వర్షాలు కురిశాయి. నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన మూసీ వరద గురువారం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. జిల్లాలో సగటున 8.7మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా ఆలేరులో 3.8మిల్లీమీటర్ల వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు-బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామాల మధ్యన ఉన్న మూసీ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహించిన వరద తగ్గుముఖం పట్టడంతో వాహనదారులు రాకపోకలు సాగించారు. రాత్రి భారీ వర్షం కురిస్తే ఏ సమయాన మూసీ వరద ఉధృతి పెరగనుందోనని పోలీసులు నిఘా ఉంచారు. వలిగొండ మండలం నెమలికాల్వ గ్రామంలోని ఆసీఫ్‌నగర్ కాల్వ వద్ద మూసీ నదీ పరవళ్లు తొక్కుతోంది. సంగెం గ్రామ భీమలింగం కత్వ వద్ద మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగెం- బొల్లేపల్లి గ్రామాల నడుమ కల్వర్టు కిందినుంచి వరద నీరు తగ్గడంతో అధికారులు వాహనాల రాకపోకలను అనుమతించారు.



నెమలికాల్వ గ్రామ పరిధిలో ఆసిఫ్‌నహర్ కాల్వ వద్ద మూసీ ప్రవాహం

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, తదితరులు

భువనగిరి(కలెక్టరేట్),ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని అధికారులు వచ్చే రోజుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో సహాయక చర్యల నిమిత్తం ఉమ్మడి 10 జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. సెలవులో ఉన్న అధికారుల సెలవులు రద్దు చేసి వెనక్కి రప్పించాలన్నారు. లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. రైల్వే లైన్లు, లోలెవల్ బ్రిడ్జిలు కాజ్‌వేలు, కల్వర్టుల వద్ద వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చూడటంతోపాటు, బ్రిడ్జిల పైనుంచి నీటి ప్రవాహం వెళ్లే చోట పోలీసు సిబ్బందిని నియమించాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్ రావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాల నేపథ్యంలో ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. జిల్లాలో వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడాలన్నారు. పోలీసు, రెవెన్యూ ఇరిగేషన్ శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. వాగులు, వంకలు, వరదల వద్దకు ప్రజలు వెళ్లకుండా చూడాలని, మూసీ పరివాహక ప్రాంతాల నీటి ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

(ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్): అనారోగ్య సమస్యలతో పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీచేశారు. హాజరు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. ఎంత ఓపీ ఉంటోందని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. గత నెల ఆస్పత్రిలో జరిగిన సాధారణ ప్రసవాలు ఎన్నో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవం చేయించుకున్న మహిళ కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఇందిరమ్మ ఇళ్లను పూర్తిచేయాలి

(ఆంధ్రజ్యోతి, తుర్కపల్లి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి మహేందర్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆర్వోఆర్ చట్టం స్థానంలో భూభారతిని తీసుకొచ్చింది. అనంతరం జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంది. ఈ నెల 15వ తేదీలోగా సాధ్యమైనంత మేర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 15,046 దరఖాస్తులు రాగా, అందు లో 1,782 పరిష్కారయోగ్యమైనవిగా అధికారులు గుర్తించా రు. వాటిలో ఇప్పటి వరకు 1,269 దరఖాస్తులను పరిష్కరించారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)



కలెక్టరేట్‌లో భూభారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

1,269/15,046

పరిష్కరించినవి. | వచ్చిన దరఖాస్తులు

- తిరస్కరణకు గురైన వాటికి నోటీసులు జారీ
- నెలరోజులుగా పరిశీలించిన రెవెన్యూ యంత్రాంగం
- భూభారతి పోర్టల్‌లో డాటా కరెక్షన్లే అధికం

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను భూభారతి ద్వారా ఈ నెల 15లోగా పరిష్కరించి నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ సదస్సులు నిర్వహించిన అనంతరం రెవెన్యూ అధికారులు నెల రోజుల పాటు ఆయా గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేశారు. భూభారతి చట్టం పరిధిలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్ స్థాయిల్లో పరిష్కరించే భూ సమస్యలను అధికారులు గుర్తించారు. వీటిలో ప్రధానంగా పట్టాదారు భూములు అసైన్డ్, లావాణి, ప్రభుత్వ భూములుగా నమోదుకావడం, సరిహద్దు వివాదాలు, పేరు మార్పిడి వంటి వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు. మిస్సింగ్ సెంబర్లు, పెండింగ్ మ్యుటేషన్, సర్వేనెంబర్లు, పేర్లలో తప్పుల సవరణలతో పాటు చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. అయితే పరిష్కారం లభించని భూ సమస్యలపై సదరు దరఖాస్తుదారులకు ఎండార్స్‌మెంట్ (సమాధాన నోటీసు) ఇవ్వనున్నారు. శుక్రవారం నుంచి జిల్లాలోని 17 మండలాల్లోని 301 రెవెన్యూ గ్రామాల్లోని దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. భూభారతి చట్టం ప్రకారం సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో కారణాలను తెలియజేయనున్నారు. రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 15,046దరఖాస్తులు రాగా, వీటిలో ఇప్పటివరకు 1,269 దరఖాస్తులను పరిష్కరించారు.జిల్లా వ్యాప్తంగా 1,782 దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు అంగీకరించారు. మిగతా వాటికి సరైన కారణాలు చూపుతూ నోటీసులు జారీ చేయనున్నారు. ఒకటి రైతుకు, మరొకటి పంచాయతీ కార్యాలయం, ఇంకోటి తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో వీటిని అంటించనున్నారు.

డాటా కరెక్షన్లే అధికం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన

మిగతా 8వ పేజీలో...

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి
- వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్, జూనియర్ కళాశాల ఆవరణ



భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

భువనగిరి (కలెక్టరేట్),ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవానికి జిల్లా కలెక్టరేట్ సముదాయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఉదయం 8.30గంటలకు కలెక్టర్ హనుమంతరావు పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి 9.30 గంటలకు జెండా ఆవిష్కరిస్తారని జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి తెలిపారు.

కలవర పెడుతున్న వర్షాలు

భువనగిరి టౌన్ : స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా అంతటా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో, బస్తీల్లో మువ్వన్నెల జెండాను ఘనం గా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల ను స్మరించుకోనున్నారు. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయిలో నిర్వహించే వేడుకలకు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ శాఖల అభివృద్ధి శకటాల, సాంస్కృతిక ప్రదర్శనలు, పోలీసుల గౌరవ వందనం హైలెట్‌గా నిలువనున్నాయి. ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో భారీ వర్షాలు కురుస్తున్న వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో స్వాతంత్ర్య వేడుకలపై పలువురు కలవరపాటుకు గురవుతున్నారు.

రైల్వేస్టేషన్‌కు నిధులు కేటాయించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్



రైల్వేస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి గంజ్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భువనగిరి రైల్వేస్టేషన్‌కు అమృత్ స్కీమ్ కింద నిధులు కేటాయించి ఆధునీకరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ మేనేజర్ మహాలక్ష్మికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌కు వేలమంది ప్రయాణికులు వచ్చి వెళ్తుంటారని, ఈ స్టేషన్ ఆధునికీకరణకు అమృత భారత్ కింద నిధులు కేటాయించి పనులు చేపట్టాలన్నారు. స్టేషన్‌లో అన్ని రకాల వసతులు కల్పించడంతోపాటు, శాతవాహన, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని, బస్టాప్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సికింద్రాబాద్ స్టేషన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బట్టుపల్లి అనురాధ, మాయ కృష్ణ, వనం రాజు, బర్ల వెంకటేష్, బాలకృష్ణ, సుందర్, ఈర్ల రాహుల్, సాజిద్ పాల్గొన్నారు.

బీజేపీ చేతిలో ఈసీ కీలుబొమ్మ

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్టరూరల్, ఆగస్టు14, (ఆంధ్రజ్యోతి)కేంద్రంలోని బీజేపీ చేతిలో ఎలక్షన్ కమిషన్(ఈసీ) కీలుబొమ్మగా మారిందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు శుక్రవారం ఓట్ చోర్ గద్దె చోడ్ అనే నినాదంతో స్థానిక సింహ ద్వారం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్‌లో ఈసీ 65లక్షల ఓట్లను గల్లంతు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్‌చోర్ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ ఆదేశం మేరకు చేపడుతున్నారని, ఆలేరు నియోజకవర్గంలో పెద్దఎత్తున చేపట్టనున్నట్లు తెలిపారు. ఓట్‌చోరీకి పాల్పడి గద్దెనెక్కిన మోదీని గద్దె దించేవరకు ఉద్యమం చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్యరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతిగౌడ్, నెమిలె మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ కౌన్సిలర్లు ముక్కెర్ల మల్లేశం, గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్ గౌడ్, బరిగె రాంచందర్, నర్సింహగౌడ్, నర్సింహులు, పాల్గొన్నారు.




గుట్టలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య, నాయకులు

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న దశరథ, బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్,ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్‌తిరంగా యాత్రలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భువనగిరిలో ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మాయ దశరథ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ సుర్వి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కట్కమోజు కిరణ్, జె శ్యాంసుందర్‌రెడ్డి, కే రమేష్, పట్నం కపిల్, నీలం రమేష్, వేణు మాధవ్, యాట వెంకటేష్, కొల్లోజు సతీష్, మంగు నరసింహారావు, ఎదగాని సంతోష్‌నాగు వినోద్ పాల్గొన్నారు.



ప్రత్యేక సాగు..

అరుదైన గౌరవం

- పది ఎకరాల్లో కలబంద సాగు చేస్తున్న జిల్లావాసి
- ఆర్‌సీఎఫ్‌సీ సిఫారసుతో ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం 6
- కేంద్ర ఆయుష్ విభాగం ప్రత్యేక ఆహ్వానం



రైతు రాంమూర్తి

రోడ్లకు మరమ్మతులు చేయాలి

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాల వల్ల బీటీ రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే మరమ్మతు చేపట్టాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని అక్కంపల్లి టేకులసోమారం గ్రామాల నడుమ బీటీ రోడ్డును ఏర్పడిన గుంతలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య నాయకులు మల్లేశం, సతీష్, బాస్కర్, సహాదేవ్, వీరారెడ్డి, అరుణ్‌కుమార్, వెంకటేశం, మల్లేశం, నర్సింహ పాల్గొన్నారు.



రోడ్డుపై పడిన గుంతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం

పదవీ కాలం మరో ఆరు నెలలు

పీఏసీఎస్, డీసీసీబీ పాలకవర్గాల గడువు పెంపు 7

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

భారీగా సమకూరనున్న నిధులు






నేటి నుంచి వార్షిక టోల్ పాస్

- రూ.3వేల రీచార్జ్‌తో ఏడాదికి 200 ట్రిప్పులు 7

ప్రత్యేక సాగు అరుదైన గౌరవం



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొందరు రైతులు ప్రత్యేక పంటలు సాగుచేసి గుర్తింపు పొందుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ పంటలు సాగుచేసి లాభాలు గడిస్తున్నారు. ఆ కోవకే వస్తారు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన తేలుకుంట్ల రాంమూర్తి. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే పదెకరాల్లో సుమారు ఐదేళ్లుగా కలబంద సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్మ విభాగం ఆహ్వానం మేరకు ఈ నెల 15న ఢిల్లీలో జరుగనున్న స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు రాంమూర్తి-శైలజ దంపతులు ఢిల్లీ వెళ్లారు.

\- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

- పదెకరాల్లో కలబంద సాగు చేస్తున్న యాదాద్రి భువనగిరి జిల్లావాసి
- ఆర్‌సీఎఫ్‌సీ సిఫారస్సుతో కేంద్ర ఆయుష్మ విభాగం ప్రత్యేక ఆహ్వానం
- ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం

పాటిమట్ల గ్రామానికి చెందిన తేలుకుంట్ల రాంమూర్తి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసముంటారు. ఆయనకు పాటిమట్లలో తల్లిదండ్రులు సంపాదించిన వ్యవసాయ భూమి ఉంది. సాధారణ పంటలు సాగు చేస్తే తాను ఎప్పటి కప్పుడు వెళ్లి చూడలేనని(పర్యవేక్షణ చేయలేనని), ఏపంట వేస్తే బాగుంటుందని స్నేహితులతో చర్చించారు. ఓ స్నేహితుడి సలహాతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఓ రైతు సాగు చేస్తున్న కలబంద(అలోవేరా) సాగును చూసి వచ్చారు. పశువులు, కోతుల బెడద ఉండక పోవడంతో పాటు అడవి జాతి మొక్క అయినందున తెగుళ్లు సోకవని తెలుసుకొని పదెకరాల్లో ఐదేళ్లుగా కలబంద సాగు చేస్తున్నారు. సాగుకు అనుకూలంగా భూమి చదును చేసి, మొక్కలు నాటడానికి ఎకరాకు సుమారు రూ.50వేలు ఖర్చు అయిందని రాంమూర్తి తెలిపారు. ఎకరాకు 5వేల నుంచి 6వేల మొక్కలు నాటుతారు. కలబంద మొక్క నాటిన నాటి నుంచి ఒక సంవత్సరానికి కోతకు వస్తుంది. ఒక్కసారి నాటిన మొక్క ఐదేళ్లు ఉంటుంది. ఐదేళ్ల తర్వాత దానిని తొలగించి మళ్లీ నాటుకోవాలి. కలబంద పంటకు డ్రిప్ ఏర్పాటు చేశారు. ఎరువులు వేయాల్సిన అవసరం పెద్దగా ఉండదు. పనులన్నీ కూలీలు, యంత్రాలతో చేయించడంతో కలబంద సాగు నిర్వహణకు ఏడాదికి ఎకరాకు సుమారు రూ.50 వేల ఖర్చు వస్తుందని ఆయన తెలిపారు. ఏడాదికి ఎకరాకు సుమారు 15టన్నుల దిగుబడి వస్తుందని, సుమారు రూ.1.60 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్షపైగా మిగులుతాయని, ఎర్రనేలలు కలబంద సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు.

ఎస్‌ఎంపీబీ సిఫారసుతో...

కలబంద సాగుచేస్తున్న రాంమూర్తి తెలంగాణ రాష్ట్ర ఔషధ మొక్కల(మెడిసినల్‌ప్లాంట్లు) బోర్డులో నమోదై ఉన్నారు. ఎస్‌ఎంపీబీతో పాటు రీజినల్ కం ఫెసిలిటేషన్ సెంటర్(ఆర్‌సీఎఫ్‌సీ) సిఫారస్సుతో కేంద్ర ప్రభుత్వ ఆయుష్మ విభాగం రాంమూర్తి-శైలజ దంపతులను ఢిల్లీ జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానించింది. 16వ తేదీ వరకు అక్కడే ఉండడానికి కేంద్ర ప్రభుత్వం వసతి కల్పిస్తుంది.


కలబంద పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి



కలబంద సాగు లాభదాయకంగానే ఉన్నప్పటికీ మార్కెట్ సౌకర్యం తక్కువ. ఎక్కడ విక్రయించాలో తెలియక రైతులు ఎక్కువగా సాగు చేయడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలబందకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. మార్కెట్ సౌకర్యం ఉంటే సాగు పెరుగుతుంది. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు, గుజ్జు తీసే యంత్రం లాంటివి సబ్సిడీపై అందించాలి.

\- తేలుకుంట్ల రాంమూర్తి, రైతు.

బేగంపేట.. మీ దేశభక్తికి సలాం



బేగంపేటలో ఎగురుతున్న జాతీయ పతాకం

- గ్రామంలో 78 ఏళ్లుగా మువ్వన్నెల జెండా రెపరెపలు
- జాతీయ పతాకంపై గౌరవం.. అమితమైన ప్రేమ గ్రామస్థుల సొంతం
- జాతీయ పతాక ఆవిష్కరణ అంటే వారికి పండుగే

రాజాపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామస్థులకు జాతీయ పతాకంపై అమితమైన గౌరవం, ప్రేమ. స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు 1947 ఆగస్టు అర్ధరాత్రి నుంచే ఆ గ్రామంలో జాతీయ పతాకం ఎగిరింది. అప్పటినుంచి గ్రామంలో మువ్వన్నెల జెండా నిర్విరామంగా రెపరెపలాడుతోంది. ఎనిమిది దశాబ్దాలుగా గ్రామస్థులు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. బేగంపేట గ్రామం మొదటి నుంచీ విప్లవోద్యమాలకు కేంద్రం. నైజాం సర్కార్‌కు వ్యతిరేకంగా రగుల్ జెండా ఎగురవేసిన ఘనత వారిది. బ్రిటిష్ పాలకుల నుంచి స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే గ్రామానికి చెందిన బద్దం నర్సిరెడ్డి, పిట్ట రాంచంద్రారెడ్డి, చిగుర్ల మల్లయ్య, బలిజ రాజవీరయ్య కలిసి గ్రామ చావడిలో జాతీయ పతాకం ఎగురవేశారు. మూడు రంగుల జెండాను బోగ హనుమంతు తన మగ్గంపై స్వయంగా నేచి రంగులు అద్దారు. దర్జీ బొంతయ్య పతాకంపై ధర్మ చక్రాన్ని కుట్టారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 15, జనవరి 26వ తేదీల్లో, దసరా పండుగ రోజు కూడా జాతీయ పతాకాన్ని మారుస్తుంటారు. జాతీయ పతాక ఆవిష్కరణను గ్రామస్థులు డప్పు వాయిద్యాలతో పండుగలా జరుపుకుంటారు. నిరంతరాయంగా ఎగురుతున్న జాతీయ పతాకాన్ని చూసి గర్వంగా సెల్యూట్ చేస్తారు. ఆగస్టు 15వ తేదీన 79వ సారి గ్రామస్థులు సగౌరవంగా పతాకాన్ని ఎగురవేయనున్నారు.

జాతీయ పతాకాన్ని అందరం గౌరవిస్తాం



మా గ్రామంలో జాతీయ పతాకం నిరంతరంగా ఎగురుతోంది. జాతీ పతాకాన్ని అందరం గౌరవిస్తాం. కలసికట్టుగా పండుగలా జరుపుకుంటాం. అనవాయితీగా పతాకాన్ని ఎగురవేస్తున్నాం.

\- భిక్షపతి, సింగిల్‌విండో డైరెక్టర్, బేగంపేట.

మాకు గర్వంగా ఉంది



మా గ్రామంలో జాతీయ జెండాను ఎగురవేయడం ఎంతో గర్వంగా ఉంది, స్వాతంత్ర్యం సిద్ధించిన రోజునే జెండాను ఎగురవేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా ఎగురుతూనే ఉంది. ఏడాదిలో మూడుసార్లు జెండాను మారుస్తాం,

\- బోగ రుషి, మాజీ సర్పంచ్, బేగంపేట.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని సూరేపల్లిలో అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. సూరేపల్లి గ్రామానికి చెందిన కేశవపట్నం రమణయ్యపై ఈ నెల 12వ తేదీన భూ తగాదాల విషయంలో దాడి జరిగింది. భువనగిరి మండలంలోని పచ్చర్లబోడుతండాకుచెందిన గుగులోతు నర్సింహ సూరేపల్లి గ్రామానికి చెందిన రమణయ్యపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్సింహపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాధ(29)ను నమాత్‌పల్లి గ్రామానికి చెందిన పడిగెల వెంకటేశ్ ప్రేమించి రెండో పెళ్లిచేసుకున్నాడు. కాగా రాధ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో రాధ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. తమ ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామానికి చెందిన మీనాక్షి బుధవారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది మీనాక్షిని మల్కాపురం నుంచి చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ ఈఎంటీ వినయ్‌కుమార్, పైలెట్ చిన్నస్వామి ప్రసవం చేశారు. మీనాక్షి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. మెరుగైన వైద్యంకోసం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కోదాడ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని కాపుగల్లుశివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎస్పీ కాల్వలో కంపచెట్లకు మృతదేహం అడ్డుపడిఉండి, కుళ్లిపోయిన స్థితిలో ఉంది. మృతదేహంపై తెల్లని చొక్కా, నల్లని లోయర్ ఉంది. గ్రామ కార్యదర్శి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బొడ్రాయి పండుగకు వెళ్లి వస్తూ..

గుర్రంపోడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బొడ్రాయి పండుగకు వెళ్లి ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తి గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గుర్రంపోడు మండలంలోని తుర్కపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం... అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందిన గణపతి వెంకన్న(42) గుర్రంపోడు మండలంలోని మక్కపల్లి గ్రామంలో గురువారం జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు బంధువుల ఇంటికి వెళ్లాడు. బైక్‌పై తిరిగి గ్రామానికి వస్తుండగా తుర్కపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గేదె రోడ్డుకు అడ్డంగా రావడంతో ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



భువనగిరిలో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అర్జునయ్య

భువనగిరి టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అపరిచితులతో మహిళలు జాగ్రత్తగా ఉండాలని యాదాద్రిభువనగిరి జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ అర్జునయ్య అన్నారు. పలుఅంశాలపై భువనగిరి బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణాలు, బస్టాండ్, మార్కెట్ తదితర బహిరంగ ప్రదేశాలలో గుర్తుతెలియని స్త్రీ, పురుషులు ఎవరైనా మాట్లాడించే ప్రయత్నాలకు, ఆహార పదార్థాలు, ప్రలోభాలకు గురి కావద్దన్నారు. ఒంటరిగా మహిళలు అధిక మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు, తీసుకు వెళ్లవద్దని సూచించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు వస్తే తలుపు తీయవద్దని, ఫేక్ ఫోన్ కాల్స్ ఎత్తవద్దని సూచించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అండాలు, కృష్ణ, ఏఎస్ఐ రాములు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌చారి, కానిస్టేబుల్స్ తురుపతమ్మ, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్, ఇసుక ట్రాక్టర్ పట్టివేత


కనగల్, ఆగస్టు 14:(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని బోయినపల్లి గ్రామ వాగులో అనుమతి లేకుండా ఇసుక తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను(జేసీబీ), ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న మరో ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సదరు వాహన డ్రైవర్లతోపాటు యజమానులపై కేసు నమోదు చేశారు. కనగల్ వాగుబ్రిడ్జి, బోయినపల్లి వాగుబ్రిడ్జి వద్ద ఇరు వైపులా 500ల మీటర్ల పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేదం ఉందని తెలిపారు. ఇసుక రీచ్‌ల్లో అధికారులు సూచించిన ప్రదేశంలోనే ఇసుకను ఎత్తుకోవాలని సాండ్‌టాక్సీ వాహనదారులకు సూచించారు. బ్రిడ్జికి సమీపంలో ఇసుక తవ్వకాల కారణంగా అవి కూలిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



విద్యుత్ దీపాలతో ముస్తాబైన నల్లగొండ మునిసిపల్ కార్యాలయం




నల్లగొండలో సిద్ధమవుతున్న శకటం



నల్లగొండలో ముస్తాబైన అంబేడ్కర్ సర్కిల్

జెండా పండుగకు ముస్తాబు

స్వాతంత్ర్య దినోత్సవానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబవుతున్నాయి. కలెక్టరేట్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలెక్టరేట్ ప్రాంగణాల్లో ఉదయం 8.30గంటలకు అతిథులు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



సూర్యాపేట కలెక్టరేట్‌లో సిద్ధమవుతున్న వేదిక



నల్లగొండలో...



నల్లగొండలో విద్యుదీపాలతో సుభాష్‌చంద్రబోస్ సెంటర్



నల్లగొండలో పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లు



భువనగిరిలో సిద్ధమవుతున్న వేదిక



భువనగిరిలో అతిథుల కోసం సిద్ధమైన కుర్చీలు

'పేట' చోరీ ఘటనలో అరకిలో బంగారం స్వాధీనం?

● సూర్యాపేట నగల దుకాణం చోరీ కేసులో పురోగతి ● పక్కా సమాచారంతో కోల్‌కతాకు పోలీసులు ● ముఠా సభ్యుల్లో ఒకరి అరెస్టు



బంగారు ఆభరణాల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నర్సింహ(ఫైల్)

సూర్యాపేట క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీరోడ్డులో గల శ్రీసాయిసంతోషి నగల దుకాణంలో జరిగిన చోరీ కేసులో సూర్యాపేట జిల్లా పోలీసులు అర కిలో బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. గత నెల 20వ తేదీ అర్ధరాత్రి నేపాల్, జార్ఖండ్‌కు చెందిన వ్యక్తులు నగల దుకాణంలో చోరీకి పాల్పడి సుమారు మూడు కిలోల బంగారు ఆభరణాలు, సుమారు రూ.20లక్షల నగదును అపహరించారు. దుకాణ యజమాని తెడ్ల కిశోర్ ఫిర్యాదుతో పట్టణ పోలీసులకు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నర్సింహ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. ఖమ్మం జిల్లాకేంద్రంలో నివాసంఉంటే ఓ మహిళకు చోరీ ఘటనకు సంబంధించి ముందస్తు సమాచారం ఉండడం, చోరీకి పాల్పడిన నేపాల్‌కు చెందిన ప్రధాన నిందితుడితో కొన్నినెలలుగా పరిచయం ఉందని గుర్తించిన సూర్యాపేట పోలీసులు ఇటీవల ఆమెను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీకి పాల్పడిన నిందితుడు సూర్యాపేట నుంచి పారిపోయే క్రమంలో ఖమ్మంలో ఉంటున్న ఆ మహిళకు ఆభరణాలు ఇచ్చి వెళ్లటంతో సుమారు 14తులాల బంగారు అభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

మహిళ ఇచ్చిన సమాచారంతో..

సదరు మహిళ ఇచ్చిన సమాచారంతో పది రోజుల క్రితం కోల్‌కతా వెళ్లిన సూర్యాపేట జిల్లా పోలీసులు ముఠా సభ్యుల్లో ఒకడిని అదుపులోకి తీసుకుని సుమారు అర కిలో బంగారు అభరణాలతో పాటు కొంత మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో మిగిలిన నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

నల్లగొండ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలోని నల్లగొండ-1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న 10మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డితో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కే. శివరాంరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ అదేశాల మేరకు నల్లగొండ-1టౌన్ పరిధిలో రెండు చోట్ల గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో, నల్లగొండ-1టౌన్ ఎస్ఐ జె.గోపాల్‌రావు తన సిబ్బందితో కలిసి మునుగోడు మునుగోడు రోడ్డులో గంజాయి సేవిస్తూ, విక్రయిస్తున్న ఆరుగురు యువకులను పట్టుకున్నారు. అదేవిధంగా నల్లగొండ-1టౌన్ ఎస్ఐ సతీష్‌తో తన సిబ్బందితో కలిసి మిర్యాలగూడ రోడ్డులో గల జూబ్లీ హిల్స్ కాలనీ సమీపంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 30వేలు విలువ చేసే 1.65 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయిని సేవిస్తున్న ఆరుగురు యువకులను రిహాబిటేషన్ సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. గంజాయి సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

భగవాన్‌సింగ్ ఆశయాలు సాధించాలి

సూర్యాపేటరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి గిరిజనుడు లోనవత్ భగవాన్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేయాలని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రాంచందర్‌నాయక్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని రాజనాయక్‌తండాలో గిరిజనుల నాయకులు దివంగత భగవాన్‌సింగ్ 3వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీలకతీతంగా నియోజకవర్గ ప్రజలను గౌరవించేవారని, ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కరించేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వూర రాంమూర్తి యాదవ్, పెద్దిరెడ్డి రాజా, డాక్టర్లు సునీల్, గిరిదర్, రాజానాయక్, శాంతాబాయి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న డిప్యూటి స్పీకర్ రాంచందర్‌నాయక్

తాటిచెట్టు పైనుంచిపడి గీతకార్మికుడు మృతి



శ్రీను(ఫైల్)

శాలిగౌరారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారింగుల శ్రీను(45) రోజు మాదిరిగానే కల్లు గీయడానికి గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కాడు. కల్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. ఇరుగుపొరుగు వారు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108లో నకిరేకల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. శ్రీనుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

దొంగ ఓట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ

నల్లగొండ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లతో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని నల్లగొండ కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు దొంగ ఓట్లపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ఎన్జీ కళాశాల వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ దొంగ ఓట్లతో మూడోసారి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. ఒక్క అడ్రస్ తో వందలాదిమందికి ఓటు హక్కు కల్పించి ఓటు వేయించారని ఆరోపించారు. దొంగ ఓట్లన్నీ బిజెపి నాయకులే నమోదు చేయించారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుబ్బ రూప, గాజుల సుకన్య, భాగ్య, సురెడ్డి సరస్వతి , ఎగ్గడి సుజాత, షేక్ జాను, జక్కలి లలిత, బొడ్డుపల్లి జానకి, సదాలక్ష్మి, మీరా ఉన్నారు.

మువ్వన్నెల పతాక రెపరెపలు



దేశభక్తి పెంపొందించేలా.. సమైక్యత భావం ఉప్పొంగేలా.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో వందడుగుల (30 మీటర్లు) జాతీయ జెండా ఏర్పాటు చే శారు పాలకులు. నేను-నా మిర్యాలగూడ నినాదంతో, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చొరవతో ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండా ను 2024లో నిర్వహించిన 78వ స్వాతం త్ర్య దినోత్సవంలో ఆవిష్కరించారు. వేలాది మంది విద్యార్థులు ర్యాలీలు, మహిళల కోలాట ప్రదర్శనలతో త్రివ ర్ణ దుస్తులు ధ రించిన ప్రజాప్రతినిధుల సమక్షంలో ఏర్పాటైన జెండా నేటికి 365 రోజులు పూర్తయింది. (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

వందడుగుల జాతీయ జెండా పర్యాటక ప్రాంతంగా మారింది. రాత్రి వేళల్లో కనిపించేందుకు విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేశారు. అల్లంత దూరం నుంచి ఎత్తున కనిపిస్తున్న జెండాను దగ్గర నుంచి చేసేందుకు జనం వస్తున్నారు. జెండాను ఫొటో, వీ డియో తీయడంతో పాటు అక్కడ పోటీ పడి సెల్ఫీలు దిగుతున్నారు. అత్యున్నత స్థాయి ఇంజనీరింగ్, నాణ్య తా ప్రమాణాలతో బేస్మెంట్ నిర్మించి, ఉక్కుతో ఏర్పాటు చేశారు.

జాతీయ భావం పెంపొందించేందుకే..



ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకే నూరడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశాం. నియోజక వర్గ కేంద్రానికి వచ్చిన మంత్రులు, ఉన్నతాధికారులు, అతిథులు జెండాను చూసి మెచ్చుకుంటున్నారు. అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా.
- బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, మిర్యాలగూడ.

పెన్సిల్ మొనపై జాతీయ జెండా



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు తమలపాకుల సైదులు పెన్సిల్ మొనపైచెక్కిన జాతీయ జెండా ఆకట్టుకుంటోంది. ప్రెన్సిల్ మొనపై 9మిల్లీమీటర్ల ఎత్తుగల జాతీయ జెండా ను 15 నిమిషాల్లో చెక్కారు. గతంలో కూడా ఆవగింజపై, బియ్యపు గింజపై, అగ్గి పుల్లపై జాతీయ జెండాను, సూది రంధ్రంలో పట్టే జాతీయ జెండాను రూపొందించినట్లు సైదులు తెలిపారు.
- ఆంధ్రజ్యోతి, కోదాడ.

వెండితో ఇండియా గేట్



భువనగిరి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి చెందిన స్వర్ణకారుడు చొల్లేటి శ్రీనివాసచారి వెండితో ఇండియా గేట్ సృష్టించారు. రూ.19వేల విలువైన 16తులాల వెండితో నెలరోజులు శ్రమించి 3.5 ఇంచుల ఎత్తు, 3 ఇంచుల వెడల్పుతో ఇండియా గేట్ రూపొందించారు. అతని ప్రతిభను పలువురు అభినందిస్తున్నారు. కాగా ఇతను గతంలోనూ బంగారం, వెండితో పలు కళాఖండాలు రూపొందించాడు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరి గుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. నిత్యకల్యాణోత్సవం, సుదర్శన నారసింహ హోమం వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజ లు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 29,13,583 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు. దేవస్థానంలో కొండకింద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేసుకునేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. రోజుకు నాలుగు విడతలు జరిగే వ్రతాలు 10 గంటలకు జరిగే రెండో విడత ఉచిత వ్రతాలు నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఈ మేరకు 210 మంది భక్తులు బుధవారం సాయంత్రం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరందరికి ఉచిత పూజ సామాగ్రిని అధికారులు పంపిణీ చేస్తారు. కాగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు నిత్యం అందించే ఉచిత ప్రసాద వితరణకు హైదరాబాద్ చెందిన పుస్తె సత్యనారాయణ, సరళాదేవి దంపతులు గురువారం రూ.5లక్షల చెక్కును విరాళంగా ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మకు అందజేశారు.

నేడు గుట్టకు మంత్రి రాక

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం కొండపైన దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా 'యాదగిరి ఆధ్యాత్మిక మాస పత్రిక' ను ఆవిష్కరించి ఈ-ఆఫీస్‌ను ప్రారంభిస్తారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారు. కాగా, శ్రీకృష్ణ జయంతిని పురస్కరించుకొని శనివారం (రేపు) మల్లాపురం దేవస్థాన గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహా ప్రతిష్టాపనకు ఈవో ఎస్. వెంకట్రావు ప్రకటించారు.

కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుడి క్షేత్రంలో గురువారం శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు కమనీయంగా వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంత్ కబీర్ అవార్డు గ్రహీత జెల్ల వెంకటేశ్ మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన జాతీయ సంతు కబీర్ అవార్డు గ్రహీత జెల్ల వెంకటేశం అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. చేనేత రంగానికి విశిష్ట సేవలందించిన జెల్ల వెంకటేశ్ రాష్ట్ర, జాతీయ అవార్డులు అందుకున్నారు. 10 సంవత్సరాల పాటు కొయ్యలగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. కొయ్యలగూడెం చేనేత వస్త్రాలకు జాతీయ అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంలో వెంకటేశ్ పాత్ర గొప్పది. అనేక ముఖ్య పట్టణాల్లో చేనేత ఎగ్జిబిషన్లు నిర్వహించారు. వెంకటేశ్ అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరిగాయి. వెంకటేశ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

నల్లగొండ జిల్లా పరిధిలోని ప్రధాన ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ జలాశయానికి స్వల్పంగా నీటిరాక తగ్గినా 26క్రస్టు గేట్లనుంచి నీటిని విడుదల చేస్తున్నారు. డిండి ప్రాజెక్టు నీటిమట్టం గరిష్టస్థాయికి చేరింది. మూసీకి వరద కొనసాగుతోంది.

నాగార్జునసాగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక స్వల్పంగా తగ్గింది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువనుంచి 2,28,141 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా గురువారం సాయంత్రం 6 గంటలకు 1,72,774 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 587.50 అడుగులకు చేరుకుంది. సాగర్ నుంచి మొత్తం 2,37,056 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

డ్యామ్‌కు త్రివర్ణ శోభ

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ క్రస్ట్ గేట్లపై మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో సాగర్ డ్యామ్ త్రివర్ణ సాగరంగా మారింది. ఈ సుందర మనోహర దృశ్యం పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తోంది.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు దిగువన గల మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గత వారం రోజులకు పైగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నదికి చేరిన వరద దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టు గత వారం రోజులుగా వరద నీటితో పొంగి పొర్లుతోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇన్‌ఫ్లో 13254.45క్యూసెక్కులుగా నమోదయ్యింది. వరద ఉధృతి గురువారం ఉదయం వరకూ కొనసాగింది. హైదరాబాద్ నగరంతో పాటు యాదాద్రి జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసే వీలుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు 643.05అడుగుల గరిష్ఠ స్థాయిలో ఉన్న ప్రాజెక్టు నీటిమట్టాన్ని భారీగా తగ్గించే చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రాజెక్టు 2, 3, 4, 5, 6, 7, 8, 10నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తి 10098క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీ రిజర్వాయర్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 6612.55క్యూసెక్కులుగా నమోదయ్యింది. ఇదిలా ఉంటే 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 642.55అడుగులు (3.84టీఎంసీలు)గా ఉంది.


సాగర్ జలాశయం క్రస్ట్ గేట్లనుంచి కిందకి వెళ్తున్న వరద

బీ.వెల్లెంల రిజర్వాయర్ గేట్లు మూసివేత

నార్కట్‌పల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా బీ.వెల్లెంల రిజర్వాయర్ నుండి కుడి, ఎడమ కాలువలకు వదులుతున్న నీటి విడుదలను బుధవారం సాయంత్రం నుండి నిలిపివేసినట్లు ప్రాజెక్టు ఏఈఈ నవీన్ కుమార్ తెలిపారు. వాతావరణం సాధారణ స్థితికి చేరిన తర్వాత ఉన్నతాధికారుల సూచనలు, ఆదేశాల మేరకు గేట్లను తెరుస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

ఉధృతంగా దుందుభి వాగు

డిండి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి వల్ల గతవారం రోజులుగా ఎగువన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో కురుస్తున్న భారీ వర్షాలకు డిండి ప్రాజెక్టు నీటి మట్టం 36 అడుగుల గరిష్ఠస్థాయికి చేరింది. దుందుభివాగుకు వరద ప్రవాహం పెరగడంతో గురువారం ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అయింది. ఎగువ నుంచి 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ప్రాజెక్టు జేఈ పరమేష్ తెలిపారు. ఈ వానాకాలం ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలోని 12,500 ఎకరాలకు, కుడికాల్వ పరిధిలోని 300 ఎకరాలు సాగులోకి రానుంది. ఇప్పటికే గతనెల 30న డిండి ప్రాజెక్టు నీటిని వానకాలం సాగుకు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ విడుదల చేశారు. స్పిల్‌వే వియర్ నుం చి దిగువకు నీరు విడుదలవుతోంది. డిండి వాగుద్వారా దిగువకు విడుదలైన నీరు బక్కలింగాయపల్లి వద్ద నాగార్జున సాగర్ బ్యాక్‌వాటర్‌లో కలుస్తుంది.


అలుగుపోస్తున్న డిండి ప్రాజెక్టు

రెవెన్యూ, పోలీస్ అధికారుల హెచ్చరిక

డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టు దిగువన చేపలవేటకు పశువులు, గొర్రెలు మేపేందుకు వెళ్లకూడదని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. స్పిల్‌వే వియర్ వద్ద సెల్ఫీల కోసం నీటిలోకి దిగరాదని వారు హెచ్చరించారు.

పదవీ కాలం మరో ఆరు నెలలు

● ప్రభుత్వం ఉత్తర్వులు ● సొసైటీలకు సమకూరనున్న నిధులు

నల్లగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్), డీసీసీబీ పాలకవర్గం గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారంతో పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సహకార ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనందున, సొసైటీల అభివృద్ధి కుంటుపడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు పరిధిలో 108 సొసైటీలు ఉన్నాయి. దీంతో పాటు బ్రాంచ్‌లను కూడా విస్తరించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు టర్నోవర్ రూ.2750కోట్లకు పైగా ఉండగా రూ.3వేల కోట్ల టర్నోవర్ కోసం ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13తో పీఏసీఎస్‌తో పాటు డీసీసీబీ పాలకవర్గం ముగియడంతో ఆరు నెలల పాటు ప్రభుత్వం పొడిగిస్తూ అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసింది. తిరిగి పదవీ కాలం ముగుస్తున్న క్రమంలో మరో ఆరు నెలల పాటు పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గం బాధ్యతలు నిర్వహించనున్నాయి. సొసైటీలకు, డీసీసీబీకి స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే పాలన మందగించి అభివృద్ధి కుంటుపడే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సహకార రంగంపై దృష్టి సారించి జీవో నెంబర్ 74ను జారీ చేసింది. సహకార వ్యవస్థ నిబంధనలు, 1964 యాక్ట్ ప్రకారం గడువు పొడిగించినప్పుడల్లా పదవీకాలం ఆరు నెలల వరకు పెరుగుతుంది. ప్రభుత్వం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల అనంతరమే పీఏసీఎస్‌ల ఎన్నిక నిర్వహించి డీసీసీబీ పాలకవర్గాన్ని కూడా ఎన్నుకునేందుకు చర్యలు తీసుకోనుంది. పాలకవర్గాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందున సొసైటీలకు, డీసీసీబీకి పెద్ద మొత్తంలో నిధులు సమకూరనున్నాయి. అదేవిధంగా డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాస్కాబ్ డైరెక్టర్‌గా ఎన్నికైనందున జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు అత్యధికంగా నిధులు రప్పించేందుకు అవకాశం ఏర్పడింది. అదేవిధంగా రైతులకు దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలతో పాటు విద్యా రుణాలు, గోల్డ్ లోన్‌లు, ఇంకా ఇతర రుణాలు భారీగా మంజూరు చేసేందుకు కూడా అవకాశం ఏర్పడింది.

సొసైటీలను మరింత బలోపేతం చేస్తాం: డీసీసీబీ చైర్మన్

పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గం గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసినందున సొసైటీలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం కలిగింది. ఆరు నెలల పాటు పదవీకాలం పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు. నాస్కాబ్ డైరెక్టర్, డీసీసీబీ చైర్మన్‌గా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పీఏసీఎస్‌లను, డీసీసీబీని బ్రాంచ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం సంతోషకరం. రైతుల కోసం రైతులతో 107 సంవత్సరాల క్రితం ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఈ సంవత్సరం పైగా కాలంలోనే రూ.3వేల కోట్ల టర్నోవర్ వరకు తీసుకుపోవడానికి డీసీసీబీ పాలకవర్గ సభ్యులతో పాటు పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఎంతగానో సహకరించారు.. రాబోయే రోజుల్లో బ్యాంకు మరింత అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తాం.

జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణి



సూర్యాపేట టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలిగా సూరారపు కృష్ణవేణిని నియమించారు. ఈ మేరకు కృష్ణవేణి పేరున తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో అనుబంధ సంఘాలతో పాటు పలు జిల్లాల అధ్యక్షులను కవిత ప్రకటించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్‌కు చెందిన సూరారపు కృష్ణవేణి నిజిల్లా అధ్యక్షురాలిగా నియమించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షు రాలిగా అవకాశం ఇచ్చిన కవితకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతను, సమర్థంగా నిర్వహిస్తానని, జిల్లాలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని అన్నారు.

వాలీబాల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో అండర్- 15 బాలబాలికల వాలీబాల్ క్రీడా ఎంపిక పోటీలు జరిగాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ ఎంపిక పోటీలకు వివిధ పాఠశాలల నుంచి బాల, బాలికలు హాజరై క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన బాల, బాలికలను హైదరాబాద్‌లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-15 బాలబాలికల పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ సెక్రటరీ విమల, పీఈటీలు, బాలబాలికలు పాల్గొన్నారు. 14ఎంఆర్‌జీడి03: దామెర బీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అపజయాలు.. విజయానికి సోపానాలు


బెల్లి జనార్దన్ దంపతులను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయుడు

మర్రిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అపజయాలను విజయానికి సోపాలుగా విద్యార్థులు మలుచుకోవాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్, నటుడు, నిర్మాత బెల్లి జనార్దన్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ శిక్షణ ఇచ్చారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే యువత విద్యార్థులు డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మెలగాలన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడితే కలిగే నష్టాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. అలాగే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్స్ బ్యాగ్స్‌లను పంపిణీ చేశారుఅనంతరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు బెల్లి జనార్దన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు, ఉదావత్ లచ్చీరాం, ఉపాధ్యాయులు మంజులత, కొండ శ్రీనివాస్, సభావత్ వెంకట్‌కుమార్‌మీనా, ధనలక్ష్మి, స్వరూప రాణి, ఫరంగి, సికిందర్, గిరి వెంకటయ్య, శ్రీనివాస్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

17న ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 17వ తేదీన పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ సంస్థ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బయ్యన్న ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 9398081178ను సంప్రదించాలని కోరారు.

క్రీడా పాఠశాలకు 14 మంది ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన హాకీ, అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడా అకాడమిలో 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో జూలై 15, 16 తేదీల్లో జరిగిన ఎంపిక పోటీల్లో జిల్లా కు చెందిన తొమ్మిది మంది బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికయ్యారని డీవైఎస్‌వో అక్బర్‌అలీ ఒక ప్రకటనలో తెలిపారు. బాలికల విభాగంలో నల్లగొండకు చెందిన భావన ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

నేటి నుంచి వార్షిక టోల్ పాస్ విధానం

● రూ.3వేలతో ఏడాదికి ఒకసారి రీచార్జీతో 200 ట్రిప్పులు

కేతేపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్) విధానం 65వ నెంబర్ జాతీయ రహదారిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని మూడు టోల్‌ప్లాజాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చింది. ఏడాదికి ఒకసారి రూ.3వేలతో వార్షిక ఫాస్టాగ్‌ను రీచార్జీ చేయించే నాలుగు చక్రాల సొంత వాహనదారులకు(తెలుపు రంగు ప్లేట్) టోల్ భారం తగ్గనుంది. నాలుగు చక్రాల ట్యాక్సీ వాహనాలకు (పసుపు రంగు ప్లేట్) ఈ వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్) వర్తించదు. ఈ వార్షిక టోల్‌పాస్ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలలో మాత్రమే పని చేస్తుంది. ఈ పాస్‌తో ఒక్కో వాహనం జాతీయ రహదారులపై 200ట్రిప్పులు తిరిగే వెసులుబాటు ఉంది. ఒక టోల్‌ప్లాజా నుంచి ఒక వైపు ప్రయాణానికి ప్రస్తుతం నాలుగు చక్రాల వాహనదారుడు రూ.50 నుంచి రూ.130 వరకు చెల్లించాల్సి వస్తుండగా వార్షిక టోల్‌పాస్‌తో కేవలం రూ.15కే ఒక టోల్‌ప్లాజాను దాటే వీలు కలుగుతుంది. ప్రస్తుతం 65వ నెంబరు జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికిల్ వాహనదారులు ఒక ట్రిప్పుకు ఈ రహదారిపై గల యాదాద్రిభువనగిరి జిల్లా పతంగి టోల్‌ప్లాజాలో రూ.80, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో రూ.130, ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు టోల్‌ప్లాజాలో రూ.105 మొత్తంగా రూ.305 చెల్లిస్తున్నారు. ఇరువైపులా ప్రయాణానికి రూ.610 చెల్లించాల్సి ఉంటుంది. ఈ వార్షిక టోల్‌పాస్‌తో ఈ రహదారిలోని మూడు టోల్ ప్లాజాలను దాటడానికి కేవలం రూ.45 మాత్రమే భరించాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంతో కలిపితే ఒక వాహనం రూ.90తో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లి రావచ్చు. అయితే ఈ వార్షిక పాస్ వాహనదారులంతా తీసుకోవడం తప్పనిసరేమీ కాదు. వాహనదారుల రోజువారీ టోల్‌చార్జీలను తగ్గించడమే లక్ష్యంగా అమలుచేస్తున్న ఈ వార్షిక టోల్‌పాస్ (ఫాస్టాగ్)ను ఇష్టపడని వారు ప్రస్తుతం వాడుతున్న సాధారణ ఫాస్టాగ్‌తో యథాత థంగా ప్రయాణించే వెసులుబాటు వాహనదారులకు కల్పించారు. హైదరాబాద్ - విజయవాడల రహదారిపై ఇరువైపులా సాధారణ రోజుల్లో 9వేల నుంచి 12వేల వాహనాలు ప్రయాణిస్తుండగా వారాంతపు రోజుల్లో దాదాపు 15 వేల వరకు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పండగ రోజుల్లో ఈ సంఖ్య 20 వేల వరకు ఉంటుంది.


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

వార్షిక ఫాస్టాగ్ ఎలా తీసుకోవాలి?

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన వార్షిక ఫాస్టాగ్ కోసం వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ)అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి వాహన రిజిస్ట్రేషన్ వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్‌లో రూ.3వేలు చెల్లిస్తే ప్రస్తుత ఫాస్టాగ్‌కు లింక్ అవుతుంది. వాహనదారుడు ప్రస్తుతం వినియోగిస్తున్న ఫాస్టాగ్ బ్లాక్‌లిస్టులో లేకుండా యాక్టివ్‌గా ఉండేలా చూసుకోవాలి.

వార్షిక టోల్‌పాస్ అమలుకు ఏర్పాట్లు చేశాం

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న వార్షిక టోల్‌పాస్(ఫాస్టాగ్) అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. వార్షిక టోల్‌పాస్ కలిగిన వాహనాల కొరకు టోల్‌ప్లాజాలో ప్రస్తుతానికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏమీ లేవు. భవిష్యత్తులో ఎన్‌హెచ్ఏఐ ఆదేశిస్తే ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. వార్షిక ఫాస్టాగ్ కలిగిన వాహనాలు టోల్‌ప్లాజాలోని ఏ కౌంటర్ నుంచైనా వెళ్లవచ్చు.
-ఇమ్రాన్, మేనేజర్, కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

పశువులను రోడ్లపైకి వదలొద్దు: కమిషనర్

భువనగిరి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ రహదారులపై స్వేచ్ఛగా సంచరిస్తున్న పశువులను యజమానులు వెంటనే తరలించాలని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం గురువారం ఓ ప్రకటనలో సూచించారు. పశువుల సంచారంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అవి విసర్జిస్తున్న వ్యర్థాలతో పరిసరాల పరిశుభ్రతకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. యజమానులు స్పందించకుంటే పశువులను గోశాలలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

జాతీయ పతాకాన్ని ప్రతీ ఇంటిపై ఎగురవేయాలి

ఆలేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశ ఔన్నత్యాన్ని, విశిష్టతను చాటే భారత జాతీయ పతాకాన్ని ప్రతి ఇంటిపై ఎగురవేయాలని ఆలేరు హైస్కూల్ హెడ్‌మాస్టర్ దాసరి మంజుల, ఎన్‌సిసి అధికారి దూడల వెంకటేశం అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో ఎన్‌సిసి నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమం 2022న కేంద్ర హోంశాఖ ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసుకొనే అవకాశం కల్పించిందని తెలిపారు.

ప్రతీ ఇంటికీ 'అమృత్' జలాలు

- చురుగ్గా ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- ఆరు మాసాల్లో పూర్తి చేసేందుకు ప్రణాళిక

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ మునిసిపాలిటీలోని ప్రతీ ఇంటికీ కృష్ణాజలాలు అందనున్నాయి. రూ. 21-00 కోట్ల అంచనాతో అమృత్ 2.0 పథకం పనులు కొనసాగుతున్నాయి. ఆరు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు కృష్ణా జలాలను అందించాలన్న లక్ష్యంతో ప్రజారోగ్య శాఖ అధికారులు పనులను వేగవంతం చేశారు. ఈ పథకం క్రింద మూడు ఓహెచ్‌ఎస్ ట్యాంకుల నిర్మాణం జరుగుతుండగా, స్థల సమస్యతో ఒక ట్యాంక్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రజారోగ్య శాఖ డీఈఈ మనోహర వారానికి రెండు, మూడు సార్లు ఈ పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తూ వేగవంతం చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా వచ్చే కృష్ణా జలాలను ఈ ట్యాంకుల్లోకి పంపించి, ఈ ట్యాంకుల నుంచి ఏర్పాటు చేసే ప్రత్యేక పైప్‌లైన్ల ద్వారా ప్రజలకు తాగు నీటిని అందించనున్నారు. మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖల క్రింద కృష్ణా జలాలను ఇంటింటికి అందించాలన్న లక్ష్యంతో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమృత్ 2.0 పథకం పనులను ప్రజారోగ్య శాఖ కు అప్పగించారు. ఈ పథకం పనులకు 2024 ఆగస్టు 5న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల కాల పరిమితిలో పనులను పూర్తి చేయవలసి ఉండగా, ఇప్పటికే ఒక సంవత్సరం గడిచి పోయింది. కొన్ని


శివాజీనగర్‌లో నిర్మిస్తున్న ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు

సాంకేతిక సమస్యలతో ట్యాంకుల నిర్మాణ పనులు కొంత ఆలస్యంగా మొదలు పెట్టవలసి వచ్చింది. మొదటి దశలో ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టారు. చౌటుప్పల్ పట్టణంలోని 10వ వార్డు (శివాజీ నగర్) , మునిసిపల్ పరిధిలోని 6వ వార్డు (తంగడపల్లి), 13 వ వార్డు (జయభూమి వెంచర్) , 8 వ వార్డు (లక్కారం) లలో ఈ పథకం క్రింద నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను చేపట్టారు. ఇందులో భూ సమస్య కారణంగా లక్కారం లోని ట్యాంక్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

ట్యాంకుల సామర్థ్యం..వ్యయం

చౌటుప్పల్ పట్టణంలోని జయభూమి వెంచర్, మునిసిపాలిటీలోని తంగడపల్లిలలో ఒక్కొక్కటి 7 లక్షల లీటర్ల సామర్థంగల రెండు ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, చౌటుప్పల్‌లోని శివాజీనగర్, లక్కారం లలో ఒక్కొక్కటి 5 లక్షల లీటర్ల సామర్థం గల రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. 7 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ ఒక్క ట్యాంకుకు రూ. 1.50 కోట్లు, 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్ ఒక్కంటికి రూ.1.20 కోట్ల ను వెచ్చించి నిర్మిస్తున్నారు. నాలుగు ట్యాంక్‌ల నిర్మాణానికి రూ. 5.40 కోట్ల వ్యయం జరగనుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

కృష్ణా జలాల సరఫరా ను మెరుగు పరిచేందుకు అమృత్ 2.0 పథకం కింద నిర్మాణ పనులను కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.9.66 కోట్లు (46శాతం), రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6.93కోట్లు(33 శాతం), స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ వాటా రూ.2.94 కోట్లు (14 శాతం), మునిసిపాలిటీ వాటా రూ.1.47కోట్లు (7శాతం)గా విభజించారు. ఈ నిష్పత్తి ప్రకారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను విడుదల చేస్తున్నాయి.

పైప్‌లైన్ల ఏర్పాటుపై సర్వే పూర్తి

నాలుగు ట్యాంకుల నుంచి కృష్ణా జలాలను ప్రజలకు అందించేందుకు చేపట్టిన పైప్‌లైన్ ఏర్పాటు సర్వే పనులు దాదాపుగా పూర్తయినట్టు అధికారులు తెలిపారు. పైప్‌లైన్లు పూర్తిగా లేని ప్రాంతాలతో పాటు గతంలో వేసిన పైప్‌ల సైజు తక్కువగా ఉన్న వాటిని తొలగించి కొత్తగా పైప్ లైన్ లను ఏర్పాటు చేయనున్నారు. కేఎస్‌ఆర్‌సీ కన్సల్టేన్సీ ఆధ్వర్యంలో పైప్ లైన్ ఏర్పాటు సర్వే పనులను చేపట్టారు. సుమారు 30 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ ఏర్పాటు చేయవలసి ఉంటుందని ప్రాథమిక అంచనా.

తాళ్లసింగారం వాసుల ఆగ్రహం

మునిసిపాలిటీలోని తాళ్లసింగారంలో నిర్మించవలసిన ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకును రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జయభూమి వెంచర్‌లోకి మార్చడం పట్ల ఆ ప్రాంత ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మునిసిపాలిటీకి చెందిన అప్పటి ప్రజా ప్రతినిధులు సాగించిన లాలూచీ వ్యవహారంతోనే ట్యాంకు నిర్మాణాన్ని తాళ్ల సింగారం నుంచి జయభూమి వెంచర్‌లోకి మార్పిడి చేశారన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి.

కృష్ణా జలాలు ఎక్కడినుంచి వస్తాయంటే..

నాంపల్లి మండలం ఎస్. లింగోటంలోని కృష్ణా జలాల శుద్ధి కేంద్రం నుంచి చౌటుప్పల్‌కు గ్రిడ్ పైప్ లైన్ నుంచి మునిసిపాలిటీలోని నాలుగు ట్యాంకులకు ప్రత్యేక పైప్‌లైన్లను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ పైప్‌లైన్ల ఏర్పాటుపై గ్రిడ్, ప్రజారోగ్య శాఖ అధికారుల మధ్య చర్చలు సాగుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారంగా కృష్ణా జలాలను సరఫరా చేస్తున్నారు. అప్పుడు 25వేల జనాబా ఉండగా, అది ఇప్పుడు లక్ష దాటింది. కొత్తగా నిర్మిస్తున్న ఈ ట్యాంకుల్లోకి కృష్ణా జలాలను పంపించాలంటే అదనంగా లింగోటం శుద్ధి కేంద్రం నుంచి పంపింగ్ చేయవలసి ఉంటుంది. ఇందుకోసం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సహకారంతో త్వరిత గతిన పనులను పూర్తి చేయించి ప్రజలకు కృష్ణా జలాలను అందించాలన్న లక్ష్యంతో ప్రజారోగ్య శాఖ డీఈఈ మనోహర ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రారంభమైన అమృత్ 2.0 పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయించి, పట్టణంలోని ప్రజలకు కృష్ణా జలాలను అందించాలి. ప్రస్తుతం పట్టణంలోని అనేక ప్రాంతాలకు బోరు బావుల నీటినే సరఫరా చేస్తుండడంతో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పట్టణ ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పథకం క్రింద కొన్ని కాలనీలకు మాత్రమే కృష్ణా జలాలు అందుతున్నాయి.

-కడారి కల్పనయాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు, చౌటుప్పల్

ఆరు నెలల్లో పనులు పూర్తి చేయిస్తాం

చౌటుప్పల్ మునిసిపాలిటీలోని అమృత్ 2.0 పథకం కింద రూ. 21 -00 కోట్ల అంచనాతో చేపట్టిన పనులను ఆరు నెలల్లో పూర్తి చేయిస్తాం. అగ్రిమెంట్ గడువు మరో సంవత్సరం ఉంది. మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతుండగా, స్థల సమస్యతో లక్కారం (8 వార్డు) లో ఒక ట్యాంకు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రతీ ఇంటికి కృష్ణా జలాలను అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా పైప్‌లైన్లను ఏర్పాటు చేయిస్తాం. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం.

-మనోహర, డీఈఈ, ప్రజారోగ్య శాఖ, చౌటుప్పల్ డివిజన్

సామ్రాజ్యవాదానికి తలొగ్గొద్దు: సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అమెరిన్ సామ్రాజ్యవాదానికి భారత్ తలొగ్గొద్దని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు విధిస్తుంటే మోదీ మౌనంగా ఉంటున్నారని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సామ్రాజ్యవాదంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమెరికా విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా పోరాటాలను సాగించాలని, సామ్రాజ్య వాదానికి లొంగి పోవద్దని వారు అన్నారు. ఈ సెమినార్ లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణా రెడ్డి, కల్లూరి మల్లేశం, పట్టణ, మండల కార్యదర్శులు గోశిక కరుణాకర్, గంగదేవి సైదులు, నాయకులు రాగీరు కిష్టయ్య, చీరిక సంజీవ రెడ్డి, అంతటి అశోక్, తడక మోహన్, నందీశ్వర్, బి. దశరథ, పొట్ట శ్రీను, కొండె శ్రీశైలం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి. రేష్మ, స్వామి, మల్లేశం, సుదర్శన్, సంజీవ, కొంతం సుశీల తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక కుంటుపడిన గ్రామాల అభివృద్ధి


దుబ్బాకలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రామన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న గ్రామాల్లో ఇన్‌చార్జి అధికారుల పాలనలో నిధులు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో సమస్యలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆవనగంటి వెంకటేష్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో మండలంలోని దుబ్బాక గ్రామంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహిచారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. దుబ్బాక గ్రామంలో రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడడంతో వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గ్రామాల్లో సర్వే అనంతరం గ్రామ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు శానగొండ రాము, మెట్టు శ్రవణ్, నాయకులు గుండాల నరేష్, లెనిన్ గుండాల ప్రసాద్, గుండాల అనిల్, కంబాలపల్లి మత్సగిరి పాల్గొన్నారు.

'చిట్టీల నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి'

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చట్ట విరుద్ధంగా చిట్టీల ద్వారా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్న వారిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని రాజాపేట మండలం బొందుగుల గ్రామస్థులు గురువారం అదనపు కలెక్టర్ వీరారెడ్డికి ఫిర్యాదు చేశారు. చిట్‌ఫండ్స్ మోసంపై వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా చిట్టీల ద్వారా ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న గోపగాని భానుచందర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నారు. చిట్‌ఫండ్స్ రిజిస్ట్రేషన్ చేయక పోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు కట్టకుండా ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జీ. బాలయ్య, కే.సిద్దయ్య, బీ. శంకర్ ఉన్నారు.

భగవంతుడిని నిష్ఠతో పూజిస్తే సకల శుభాలు


విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నిష్ఠతో భగవంతుడిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని సిద్ధగురు రమణానంద మహర్షి ఉద్బోధించారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో గల శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం రమణేశ్వరంలో గురువారం శతరుద్ర శివలింగాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నమక-చమక మంత్రాలు, శుక్ల యజుర్వేదంలోని ప్రసిద్ధ వేద మంత్రాలు, ప్రతీ పురోహితుడు, బ్రాహ్మణుడు, శివభక్తుడు పఠించేవి పవిత్రమైనవని అన్నారు. గణపతి, అమ్మవారి విగ్రహా శివలింగాలను అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాల్లో బోనాల సందడి


రామన్నపేట: ఇంద్రపాలనగరంలో బోనాలు ఎత్తుకున్న మహిళలు

వలిగొండ/ రామన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వలిగొండ పట్టణంలో ముదిరాజ్ కులస్థులు గురువారం పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కొత్త కుండలో నైవేద్యం తయారు చేసి డప్పు చప్పుళ్ల మధ్యన శివసత్తుల పునాలతో తరలివెళ్లి అమ్మవారికి బోనాలు చెల్లించి తమ మొక్కలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, సతీష్, చంద్రయ్య, వెంకటేశం, నర్సింహ పాల్గొన్నారు. రామన్నపేట మండల కేంద్రంలో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలను నిర్వహించారు. మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్ బోనాల ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నకిరేకంటి మొగులయ్య, ఆకవరపు మధుబాబు, బేకం నిఖిల్ స్వామి, మాజీ ఎంపిటిసిలు సాల్వేరు అశోక్, ఎండి రెహన్, వనం చంద్రశేఖర్ సాల్వేర్ రోజా లింగం, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇంద్రపాలనగరం ఎస్సీ కాలనీ మాలవాడ, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. భూతం భిక్షపతి, బందెల కిష్టాపార్, భూతం బాలస్వామి, భూతం భానుచందర్, భూతం శ్రీకాంత్, భూతం గణేష్, తదితరులు పాల్గొన్నారు.

హైలెవల్ బ్రిడ్జిని నిర్మించాలి


ప్రొద్దటూరు మూసీనది నీటిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వలిగొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దటూరు గ్రామం నుంచి వర్కట్‌పల్లికి వెళ్లే దారిలో మూసీ వంతెనపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ప్రొద్దటూరులో మూసీ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అకాల వర్షాలు కురిసినప్పుడు ఆ దారినుంచి ప్రజలు వెళ్లలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగం, కృష్ణ, బాలయ్య, నర్సింహ, బాలశంకర్, శంకర్, భీమరాజు, వేణు, ధనుంజయ్య, ముత్తయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శిథిల గృహాల యజమానులకు నోటీసులు

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని 20 శిథిల గృహాలను కూల్చి వేయాలని మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. నోటీసులు స్వీకరించిన మూడు రోజుల్లో శిథిల గృహాలను సదరు ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా కూల్చి వేయించాలని , లేని పక్షంలో మునిసిపల్ సిబ్బందితో తొలగిస్తామని కమీషనర్ హెచ్చరించారు. నివాసం లేని శిథిలమైన ఇళ్లలో పాములు, ఇతర విష పురుగులు ఉండే అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. వీటితో చుట్టు పక్కల ఇళ్లలోని వ్యక్తులకు హానికరంగా మారనుందని, శిథిలమైన ఇళ్లను తొలగించేందుకు ప్రజలు సహకరించాలని కమీషనర్ కోరారు.

కళ ప్రజల కోసమే: పీఎన్‌ఎం

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 14, (ఆంధ్రజ్యోతి): కళ కళకోసం కాదని ప్రజల కోసమని ప్రజానాట్యమండలి(పీఎన్‌ఎం) జిల్లా కార్యదర్శి ఈరపల్లి ముత్యాలు అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో ఈ నెల 20, 21 రామన్నపేట మండల కేం ద్రంలో జరిగే 3వ మహాసభలు జానపద వీధినాటకోత్సవాలు కర పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటి సభ్యుడు దేశపాక రవి, మండల కార్యదర్శి వడ్డకొండ భిక్షపతి, సభ్యులు యాదగిరి, భాస్కర్, ఎర్రవెల్లి శ్రీకాంత్, రాంబాబు, దొడ్డి సురేష్, బబ్బూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం (ఈ నెల 15న) నిర్వహించనున్న స్వాతంత్ర్య వేడుకల్లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పాల్గొననున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సంబంధిత అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరింది.

బీసీ బిల్లుకు అడ్డంకులు తొలగించాలి

మోత్కూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఏర్పడుతున్న అడ్డంకులు తొలగించి, వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచులు లేరన్న సాకుతో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల నిలిపివేయడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. నాయకులు దడిపల్లి ప్రభాకర్, కొంపల్లి లింగయ్య ఆయన వెంట ఉన్నారు.

బాధిత కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సహాయం

మోత్కూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన బొంత నర్సింహ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. పేద కుటుంబానికి చెందిన అతనికి భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉండటంతో నర్సింహ స్నేహితులు గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.30 వేలు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. పబ్బు హనుమయ్య, బీఎస్‌చారి, ఎం.ఆంజనేయులు, ఎం.నర్సింహ, కె.రమేష్, బి.మచ్చగిరి, వెంకట్, గుండు శ్రీను ఉన్నారు.

పరిష్కరించినవి 1269.. వచ్చిన దరఖాస్తులు 15046

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తుల్లో అధిక శాతం డాటా కరెక్షన్‌వే అధికంగా ఉన్నాయి. జిల్లాలో సర్వేనెంబర్లలో మార్పులు, చేర్పులు, పీపీబీ, ఆర్వోఆర్, నాలా, ఆర్‌ఎస్‌ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టు కేసులు, పోడుభూములు, తదితర 30రకాల భూసమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. చాలా మండలాల్లో భూమి ఒకచోట, కబ్జా మరోచోట ఉంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే రెవెన్యూ యంత్రాంగం తొలుత అనుభవదారు విభాగాన్ని పునరుద్ధరించాలి. అయితే భూభారతి చట్టంలో ఇప్పటివరకు అనుభవదారు విభాగం లేదు. దీంతో పాటు సర్వే నెంబర్లు, భూముల విస్తీర్ణం, పట్టాదారుల పేరు మార్పు, చేర్పులు చేపట్టాల్సి ఉంది. అయితే జిల్లా రెవెన్యూ యంత్రాంగం ప్రస్తుతం వీటి జోలికి వెళ్లడం లేదు. జిల్లాలో సాదాబైనామా దరఖాస్తులు 3,458 వచ్చాయి. వీటి పరిష్కారంపై ప్రభుత్వం భూభారతిలో అవకాశం కల్పిస్తే తప్ప జిల్లా యంత్రాంగం ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. ఈ సమస్యలు ఎప్పటిలోగా పరిష్కారం అవుతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తులు ఇలా..

ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతిని తీసుకురాగా, అందులో మొత్తం 14 మాడ్యుల్స్ ఉన్నాయి. అందులో డాటా కరెక్షన్ కింద 1,148 దరఖాస్తులు వచ్చాయి. ఎస్‌ఆర్ పీపీపీ ఏడు, కోర్టు కేసులు 123, పీపీబీ కోర్టు కేసులు 79, జీపీఏ 30, ప్రొహిబిటెడ్ 855, నాలా హౌస్ సైట్స్ మూడు, ఖాతా మెర్జింగ్ రెండు, గ్రీవెన్స్ ల్యాండ్ 24, నాలా, పీపీబీ 93, పెండింగ్ మ్యుటేషన్లు 284, సక్సెషన్ 384, అర్బన్ ల్యాండ్ 14 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు నోటీసులు జారీచేస్తున్నారు. తొలుత భూభారతో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారుల పరిశీలనకు పంపగా, అన్నీ సరిగా ఉన్న పక్షంలో వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భూభారతితో పాటు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పరిశుభ్రతను విస్మరిస్తే అంటువ్యాధులు

భువనగిరి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతను విస్మరిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 73వ రోజు గురువారం 1, 5, 6, 15, 18, 29, 30, 35 వ వార్డులలో నిర్వహించిన పనులను ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్‌అలీ, హెల్త్ అసిస్టెంట్ రజిత, రెవెన్యూ అధికారి ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్ నరేష్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి'

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్‌లో ఆగస్టు 20 నుంచి 22 వరకు నిర్వహించే సీపీఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, కుసుమని హరిశ్చంద్ర కోరారు. మండల కేంద్రంలో గుర్రం యాదగిరిరెడ్డి విగ్రహం వద్ద గురువారం మహసభల పోస్టర్లను విడుదల చేశారు. జిల్లాలో అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు బారీ సంఖ్యలో తరలి వచ్చి సభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం. వెంకటేశం, సహాయ కార్యదర్శి ఎండీ.నయీమ్, బి.నరేష్, వై.బుచ్చిరెడ్డి, జె.దయాకర్‌రెడ్డి, జి.రాజమణి, సిద్దులు, పురుషోత్తం, నర్సయ్య, క్రాంతి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

సంస్థాన్ నారాయణపురం ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను గురువారం లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కే శ్రీనివాస్ , తీరారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, పందుల యాదగిరి, గొల్లూరి సత్యనారాయణ, కొప్పు సుధాకర్, పాక జంగయ్య, తదితరులు పాల్గొన్నా

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

అడ్డగూడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అడ్డగూడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సుమన్‌కళ్యాణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రంలో ఉన్న మందుల గురించి, హాజరు శాతాన్ని పరిశీలించారు. అడ్డగూడూరు- గోవిందాపురం గ్రామాల మధ్యలో ఉన్న వాగు గురించి తెలుసుకున్నారు. 24గంటల వైద్యం అందించాలని, పర్మిమెంట్ డాక్టర్‌ను నియమించాలని డాక్టర్ సుమన్ కళ్యాణ్‌కు సీపీఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్‌కూమార్ వినతి ప్రతం అందజేశారు. డాక్టరు హేమంత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలి


మోత్కూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతాజీ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఇంటి జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పల్లెకాడి బస్వయ్య, నాయకులు మేకల చొక్కారెడ్డి, గోదాసు లింగస్వామి, గొలనుకొండ ప్రభాకర్, దోసపాటి అంజయ్య, సీత లక్ష్మయ్య, భగవాన్, భిక్షపతిచారి, ఉప్పునూతల నర్సింహ, మన్నె కృష్ణారెడ్డి, గంగపురం వంశీ, గణేష్, శ్రీకాంత్, సిద్దు, మేకల చంద్రవాస్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

ఆలేరు: మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా యాత్రలో బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమ జిల్లా కన్వీనర్ కామిటికారి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి తునికి దశరథ, జిల్లా మండల నాయకులు వడ్డెమాన్ నరేందర్, శ్రీనివాస్, వెంకటేశం, అమరేందర్, సుభాష్, మహేందర్, కిషన్, లక్ష్మీనారాయణ, సందీప్, రమణ, హనుమంతు, యాదగిరి, సారయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మోత్కూరు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న ప్రతి ఒక్కరు ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు కొనతం నాగార్జునరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల కోరారు. ప్రధాని మోదీ పిలుపులో భాగంగా గురువారం మోత్కూరులో బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగ్ జెండా' నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, జినకుల దశరథ, అన్నెపు సత్యనారాయణ, మరాటి విజయలక్ష్మీ, ఎడ్ల రాము, తీగల శ్రీధర్, ముత్తినేని తిరుమలేష్, మధు, సోమేశ్వరి, నల్ల మాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

రామన్నపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చట్టాల పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలని లీగల్ సర్వీసెస్ కమిటీ అడ్వకేట్ మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జనంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలనుసారం మండల న్యాసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సెల్ సభ్యుడు బత్తుల గణేష్‌తో కలిసి అవగాహన కల్పించారు. ప్రజలు, వారి జీవన విధాన శైలి, ఆర్థిక స్థితిగతుల మెరుగు, హక్కులు, న్యాయపరమైన అంశాలు అదేవిధంగా ప్రజలకి కుటుంబ తగాదాలు, భూ తగాదాలు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలు శాంతియుత జీవన విధానంతో పాటు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, పోలీస్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, అజ్మద్, ఆశ కార్యకర్తలు ధనలక్ష్మీ, సరిత గ్రామ ప్రజలు పాల్గొన్నారు